ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 3

## అవధూత లీలలు



పసిపిల్లలు, పిచ్చివారు, పిశాచుల వలె మహనీయులు వుంటారని ఆదిశంకరులు శెలవిచ్చారు. పూర్ణ పురుషులైన శ్రీస్వామివారి వంటి మహనీయుల చర్యలకు ఏదో ఒక బలవత్తరమైన కారణం వుంటుంది. ఆ కారణం మనకర్థంగాక వారిని పిచ్చివారని భ్రమిస్తాము. మన దృష్టిలో అర్థరహితమైన ఇలాంటి చర్యల ద్వారా వారు భక్త రక్షణ గావించారని కొద్దికాలం తరువాత ఆయా భక్తులు వివరించునపుడు మనకు తెలుస్తుంది. అలా వివరించబడని అనేక లీలలు మనమిచ్చట చూస్తాము.

ఒకరోజు శ్రీస్వామివారు 'మంటలు, మంటలు, ఆర్పండయ్యా! నీళ్ళు పోయండి' అని అరుస్తూ, దేగపూడి రామాలయం మీద, గోడల మీద ఎన్నో బిందెల నీళ్ళు పోయించారు. 'మంటలు చల్లారాయి స్వామి యిక ఆపండి' అంటే 'లేదయ్యా ఇంకా పోయాల పోయండి' అని చాలా సేపు మందిరం పైనకూడా నీళ్ళు పోయించారు. తన మహిమను అతి గోప్యంగా వుంచే శ్రీస్వామివారు ఏ భక్తులను అగ్నిప్రమాదం నుండి ఎక్కడ కాపాడుతున్నారో మనకు చెపుతారా!

ఒకప్పుడు శ్రీస్వామివారికి కాళ్ళు, చేతులు, వళ్ళు కాలింది. కారణమేమో ఎవరికీ తెలియలేదు. వారికి అప్పుడప్పుడూ మూర్ఛ వలె వచ్చేది. రాత్రిపూట ఆ మూర్ఛ వచ్చి మంటలో పడి కాలిందనుకున్నారు భక్తులు. భక్తులెవరో మంటల్లో చిక్కుకుంటే సాయిబాబావలె వారిని రక్షించడంలో తమ శరీరాన్ని కాల్చుకున్నారనుకున్నారు మరికొందరు. 'స్వామీ, ఎందుకు కాలింది?' అంటే, 'అయ్యా! పై వాళ్లు వచ్చి ద్రావకం పోసి పొయ్యారయ్యా!' అన్నారు. మోకాళ్ళకున్న గాయాలు మానుతుంటే కలబందముల్లుతో ఆ చెక్కు పెరికేస్తే మరలా రక్తం కారేది. మరలా మరలా చెక్కు కడుతూంటే తిరిగి అలాగే చేసేవారు శ్రీస్వామివారు. ఇలా మూడు నెలల వరకూ చేశారు.

ఎక్కువగా కాలిన కుడి భుజానికి డాక్టరు కట్టు కట్టబోతే శ్రీస్వామివారు వప్పుకోలేదు. భక్తులు బలవంతంగా మందు వేసికట్టు కట్టారు. శ్రీస్వామివారు అందరినీ ఏమార్చి ఆ కట్లను పేనా కత్తితో కోసేవారు. కత్తి తీసుకుంటే యిచ్చిందాకా గొడవచేశారు. భక్తులు కాపలాకాసారు. రెండు రాత్రుళ్ళు కట్టు తీయనియ్యలేదు. మూడవ రాత్రి కాపలా వున్న సేవకుడు నిద్ర తూగాడు. శ్రీస్వామివారు కట్టు కోసేసారు. ఆ పుండుపై నున్న రెండంగుళాల పుసికండను కోసి ఒక ముంత మీద పడేశారు. శ్రీస్వామివారి గాయం రక్తం కారుతున్నది. సేవకుడు లేచి లబోదిబో మన్నాడు. ఆ చర్మం బిళ్లను తులశమ్మ, వెంకమ్మ ఒక డబ్బాలో రహస్యంగా దాచారు. చిత్రంగా దాని నుండి ఒక వింతైన పరిమళం ఆశ్రమమంతా వ్యాపించింది. దానికి కారణం తెల్పమని తులశమ్మను, వెంకమ్మనూ భక్తులు వేధించారు. చివరకు అమాయకురాలు వెంకమ్మ ఒక భక్తునికి ఆ చర్మం బిళ్ళ చూపింది. అది మొదలు ఆ వింత పరిమళం అంతరించింది.

శ్రీస్వామివారు నడిచే రోజులలో ఒక్కొక్కప్పుడు రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని నాదం మీటుతుండేవారు. రాత్రి నిద్ర తూగితే నాగజెముడు ముల్లుతో పై పళ్ళ చిగుళ్ళలలోకి గ్రుచ్చుకొని రక్తం కారుతుంటే ముంతలోని నీళ్లు పుక్కిలించి మరలా నాదం మీటడం మొదలెట్టేవారు.

ఒకప్పుడు శ్రీస్వామివారిని సేవకులు రెండెడ్ల బండి మీద తీసుకుపోతున్నారు. శ్రీస్వామివారు బండిలో పడుకున్నారు. కొంతసేపటికి ఆయన కన్నులుమూసుకొని ధ్యానస్థులైనారు. బండి కుదుపుల వలన శరీరం జరిగి వారి మోకాలు బండి చక్రానికి రాసుకొని బాగా అరిగిపోయి రక్తం కారుతున్నది. కొంచెం సేపటికి భక్తులది గుర్తించి బండి నిలిపి, వారిని లేపే ధైర్యం లేక తడబడుతూ రక్తం తుడవయత్నిస్తే ఆయన లేచి వారిని తుడవనివ్వలేదు. సమాధి స్థితిలో నున్న శ్రీ రామకృష్ణ పరమహంస గారిని పరీక్షించడానికి శ్రీ వివేకానందుడు వారి తొడపై నిప్పు కణిక పెట్టినా ఆయన కదలలేదని చదివాము. శ్రీస్వామివారు అట్టిస్థితిలో వుండడం మరలా భక్తులీనాడు స్వయంగా చూచారు.

అవి శ్రీస్వామివారు నడవలేని రోజులు. ఒక రోజు ఆయన అక్కిం వెంకట్రామిరెడ్డి గారింట్లో వున్నారు. సుమారు ఉదయం పది గంటలకు

పనులు చేసుకుంటున్న సేవకులు శ్రీస్వామివారు తమ స్థానంలో లేరని గుర్తించి వెతికారు. ఆయన ఒక బండి జల్లలో నున్నట్లు గుర్తించి భక్తులు పెద్దగా ఏడవసాగారు. శ్రీస్వామివారు వత్తిగిలి పడుకున్నారు. 12 అంగుళముల పొడవున్న ఒక ప్రేగు వారి ఆసనము నుండి బయటకు వచ్చియున్నది. దానిని ఒక కాకి పొడుస్తుంటే రక్తము కారుతున్నది. భక్తులు కాకిని అదిలించబోతే, శ్రీస్వామివారు 'అబ్బో! అబ్బో! పాపము తీసుకుపోతుంటే తోలేస్తే ఎట్లా?' అన్నారు. ఆ దృశ్యము చూడలేక వెంకట్రామిరెడ్డి శ్రీస్వామివారి కంటపడకుండా గాలిలో కర్రను త్రిప్పారు. కాకి వెళ్ళిపోయింది. కొంతసేపటికి ప్రేగు లోనికి పోయింది. భక్తులు ఆయనను ఎత్తుకురాబోతే ఆయన ఒప్పుకోలేదు. వారే పరిగాడుతూ వచ్చి తన స్థానములో కూర్చున్నారు.

ఎంతో మంది తన సన్నిధిలో వుండగా ఒక్కొక్క సమయములో ఒక్కొక్కరిని లేచి ఇంటికి వెళ్ళమనిగాని, మరొకచోట కూర్చోమనిగానీ, రోడ్డు దాకా నడచి వెళ్ళమనిగాని శ్రీస్వామివారు ఆదేశించేవారు. ఫిబ్రవరి, 1980లో శ్రీస్వామివారు తమ భక్తులయిన నారాయణదాసు ఆశ్రమంలో ఉండగా తమ సేవకులను తూర్పు వైపు గుట్టవరకు నలుగురిని పోయిరమ్మని ఆజ్ఞాపించారు. ఇద్దరు వెళ్ళివస్తే ఒప్పుకోలేదు. నలుగురు కలసి తూర్పు త్రోవన వెళ్ళి అదేత్రోవన వస్తుంటే 'ఉత్తరపు త్రోవన రమ్మను' అని మరొకరితో కబురుచేసారు. దీనిభావము ఎవరికీ తెలియలేదు.

ఒక్కొక్కప్పుడు శ్రీస్వామివారు తమలోతాము బ్రహ్మాండముగా నవ్వుకునేవారు. ఆ నవ్వును టేప్ చేసుకొనే భాగ్యముంటే ఎలా వుండునో!

పెంచలకోనలో వుండగా శ్రీస్వామివారి దగ్గరకు ఎవరో వ్యాధిగ్రస్తులు వస్తే గురవయ్యను గుడ్డతో వారికి మంత్రించమన్నారు. మంత్రించగానే గురవయ్యను శ్రీస్వామివారు మంత్రించారు.

శ్రీస్వామివారు శరీరంతో ఉండగానే పెన్నబద్వేలు దగ్గరవున్న అంకాళమ్మ బోటు అనే ప్రాంతము నుండి ఒక ఆమె తన మేకపిల్ల తప్పించుకుంటే వెతుక్కుంటూ శ్రీస్వామివారి విడిది ప్రాంతానికి వచ్చింది. ఆమెకు శ్రీస్వామివారు నట్టనడిగుండములో కూర్చొని కనిపించారు.

'ఈనాటితో శ్రీస్వామివారి పని అయిపోయింది. ఇక శ్రీస్వామివారిని చూడలేమ'ని ఆమె వెళ్ళిపోయింది. తెల్లవారి ఏటికి పోయినపుడు శ్రీస్వామివారు స్నానం చేసి పంచ ఆరబెట్టుకుంటూ కనిపించారట! ఈమె ఈ విషయం శ్రీస్వామివారు శరీరంతో ఉండగానే గొలగమూడి ఆశ్రమంలో అందరికీ చెప్పింది.

శ్రీస్వామివారు ఒకనాడు నాగజెముడు ముల్లు త్రొక్కివచ్చి తన బృందంలోని వారిని తీయమన్నారు. వారు శ్రీస్వామివారి పాదాన్ని కుట్టి గాయం చేసారేగాని ముల్లు తీయలేకపోయారు. కోడూరు వెంకమ్మకు శ్రీస్వామివారు తమ కాలిచ్చి ముల్లు తీయమన్నారు. ఆమె ఎంత చిగుళ్ళలో కుడుతున్ననూ శ్రీస్వామివారు అబ్బా అనైనా అనలేదు. కాలు కదల్చలేదు. చివరకు ఆమె మల్లె ముల్లుతో పెరికితే మూడు అంగుళాల ముల్లు వచ్చింది. అంత ముల్లుతో ఆయన ఎలా నడిచారో! ముల్లు తీసినందుకుగాను వెంకమ్మకు ఒక మల్లెముల్లు, సూది, బ్లేడు బహూకరించారు.

నెల్లూరులో ట్రాఫిక్ ఎక్కువ గనుక శ్రీస్వామివారిని ఎప్పుడూ భక్తుల ఇంటినుండిగానీ, దత్తాత్రేయ మందిరము నుండిగానీ బస్టాండుకు రిక్షాలో తీసుకుపోవడం అలవాటు. ఒకరోజు శ్రీస్వామివారి సేవకులు శ్రీస్వామివారిని ఒంటరిగా వెంకట్రావు ఇంటిలో వదలిపెట్టి సినిమాకు వెళ్ళివచ్చారు. తెల్లవారి బస్టాండుకు పోవడానికి రిక్షా తెస్తే శ్రీస్వామివారు ఎక్కకుండా అంత ట్రాఫిక్‌లోను వీరిచేత డోలిలో కూర్చొని మోయించుకున్నారు. రాత్రి చెప్పకుండా సినిమాకు పోయినందుకిది శిక్ష అని గుర్తించారు ఆ సేవకులు. శ్రీస్వామివారి సేవలో వారు చెప్పినట్లు గాక మరొక విధంగా, దోషంగా చేస్తే, శ్రీస్వామివారు మాత్రం మౌనంగా ఉండి ప్రధాన సేవకునికి తగిన శిక్ష అనుభవానికి వచ్చేటట్లు చేయడమేగాక, ఇది ఫలానా దానికి శిక్ష అని ఆత్మలో ఎరుక పరిచేవారు.

రాజపద్మాపురం వాస్తవ్యులు బిరిజేపల్లి మస్తాన్ నాయుడుగారు తాను చూచిన ఒక అసాధారణ లీలను వివరించారు.

శ్రీస్వామివారు ఒకరింటికి వెళ్ళి 'అమ్మా! తినేందుకేమన్నా పెట్టమ్మా' అని అడిగారు. 'ఆమె ఇంటిలో శ్రీస్వామివారికి సమర్పించేందుకేమీలేదు. శ్రీస్వామివారికి లేదని చెప్పడం ఎలాగా' అని ఆలోచిస్తోంది. శ్రీస్వామివారికి

ఆమె బాధ తెలియకుంటే గదా! వెంటనే 'అమ్మా! కొంచెం కారప్పొడి పెట్టమ్మా' అన్నారు. శ్రీస్వామివారు దాన్ని వంటకు వాడుకుంటారని తలచి ఆ ఇల్లాలు ఒక గ్లాసునిండా మిరప్పొడి తెచ్చి ఒక ప్లేటులో పోసి శ్రీస్వామివారికి అందించింది. ఆ ప్లేటులోని మొత్తం మిరప్పొడిని రెండు నిముషాలలో చప్పరించి, మొత్తము మ్రింగేసి చేతులు దులుపుకొని 'ఇక వ్రాసుకో అయ్యా!' అని ఆమెకొక ఆశీర్వాద చీటి వ్రాయించి ప్రసాదించి వెళ్ళారు.

